


# గుణాంతరం

## – నవులూరి వెంకటేశ్వరరావు

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### బహుమతి పొందిన ఉత్తమ నవల
### (గత సంచిక తరువాయి)

"**అవి క్లిష్టమైనవి నీవెంత** కొట్టిపారేసిన. మౌలికంగా భార్యాభర్తలు స్త్రీపురుషులు. స్త్రీపురుషుల మధ్య (వాళ్ళు భార్యాభర్తలు కాకపోయిన) లైంగికసంబంధపు వాసన, నీడ ఉండకపోదు; కనీసం మానసికంగా."

"ముప్పై సంవత్సరాల సంసారిక జీవిత అనుభవంతో ఉన్నట్టు మాట్లాడుతున్నావు; నీవు ఆ అందమైన కుక్కతో, అందమైన నక్కతో చేస్తూ వచ్చిన పనిని సిద్ధాంతీకరిస్తున్నావు, సమర్థించుకుంటున్నావు. ఈ పనికి కూడా నీవు నిజాయితితో సిగ్గుపడు."

"మానవుల కొన్ని చర్యలు తర్కాతీతంగా ఉంటాయి."

"అందరు భార్యలూ నీలానే భర్తలను మోసం చేస్తున్నారా?"

"కొందరన్నా చేయడంలేదా?"

"అలా చేయనివాళ్ళ కోవలో ఉండటానికి నీవు మనస్ఫూర్తిగా ప్రయత్నం చెయ్యలేదు, లొంగుబాటు స్వభావం కారణంగా జరిగింది, స్వభావం మనిషి అధీనంలో లేదుకదా – అనక."

"నేను ప్రయత్నంచేసి విఫలమయ్యాను సంఘర్షణ తరువాత. మానవుడిలో ఎన్నోరకాల బలహీనతలు. వాడి స్వభావంలో లొంగుబాటుతనం, లొంగదీసుకోవాలనుకోడం ఒక భాగం."

"నీది బరితెగించడమూనూ."

"నీవు ఏమన్నా బాధపడకుండావుండే ప్రయత్నం చేస్తున్నాను. నీ బాధను పూర్తిగా అర్థం చేసుకోగలను. మనిద్దరం రెండు అమాయకపు, మానసికంగా అవిటి జంతువులలా ఇలాంటి ఊబిలో ఇరుక్కుని బయటపడలేక రోదిస్తున్నాము."

"మనం చాలినంత చర్చించినట్టున్నాం; దీనిపేరు గొడవ కాక నిజంగా చర్చే అయితే. ప్రతి చర్చ తరువాత ఏదో ఒక పరిష్కారం వెలువడాలి. సమస్య నీవు సృష్టించింది కనుక, అది ఇరువురినీ ఇబ్బంది పెట్టేదే అయినా, పరిష్కారం ఏమిటో నువ్వే చెప్పాలి."

అలా అతను పరిష్కారం గురించీ అడగడంలో ఆమెకు ఒక విషయం అర్థమయినట్టనిపించింది. అతను వేరుపడదామన్న ఉద్దేశంలో లేడు. అంతమేరకూ ఆమె సంతోషించదలచుకుంది. కానీ  అతనికి నచ్చే సమాధానం కానీ పరిష్కారం కానీ లేవు ఆమె వద్ద. ఆమె అశక్తురాలు.

"అది నా మనసు ఆలోచించలేనిది, కృపా. ఒకటుంది కానీ అది నీ దృష్టిలో పరిష్కారం అవునో కాదో నాకు తెలియదు."

"మాటల గారడీ ఆపి, అదేదో చెప్పు; పరిష్కారం అవునో కాదో నేను తేల్చుతాను."

"ఏమీ జరగనట్టు ఎప్పటిలా  జీవంచడానికి ప్రయత్నించడమే. కకోల్డ్ అన్న పదం మిమ్మల్ని బాధిస్తుందనుకుంటా. అది కేవలం మనకు తెలిసిన వేలాది లేక లక్షలాది పదాల్లో ఒకటే అని తీసి పారేస్తే అది మిమ్మల్ని కోరుకుతుందా కరుస్తుందా, డియర్?"

"డొంకతిరుగుడు మాని ఈ విషయం తేల్చి చెప్పు.  అనంతంగాడిని తన్ని తగలేస్తావా లేదా?"

"అతనితో సంబంధం ఏర్పడకుండా నివారించగలిగిన శక్తి నాలో లేనప్పుడు దాన్ని తెగతెంపులు చేసుకోడంలో మాత్రం ఎలా ఉంటుంది?"

"ఇంతకూ ఏమిటా బంధం; ప్రేమ సంబంధమా, కామ సంబంధమా?"

"పేరులేని సంబంధాలూ ఉంటాయి, కృపా. అందరికీ నీలా మనసూ, హృదయాలను నాకు, అంటే ఒకే వ్యక్తికి, అంకితం చేసి జీవించగల శక్తి ఉండదు."

"నీకు ఇంతటి భాషా పరిజ్ఞానం ఉందని నేను ఎన్నడూ ఊహించలేదు. నీ భాషాపరిజ్ఞానాన్ని ఉపయోగించి  మీ సంబంధానికి ముచ్చటైన నామధేయం పెట్టుకో. నీది పెడసరపు వైఖరి కాదా?"

ఆమె ఎదుటి సోఫా నుంచీ వచ్చి అతని పక్కన ఆనుకుని కూర్చుని అతని తలను తన ఒడిలోకి లాక్కుని వీపు నిమరడం మొదలెట్టింది. తల మీద ఆమె కన్నీటిబొట్లు కుళాయిలోనుంచి జారి పడ్డట్లు పడ్డాయి. ఆమెను విదిలించి కొట్టాలా, ఊరుకోవాలా? అతను అసహ్యించుకునే ఓదార్పు అతనికి కలుగుతోంది. ఎంతటి మెత్తని చనుగవ, దివ్యసుఖాన్ని దాచిన ఎంతటి మెత్తని తొడలు. స్త్రీ మాయలో భాగమే ఆ మెత్తదనం. రుష్యశృంగుడిని; వరూధిని మరికొంచం బలవంతం చేసుంటే ప్రవరాఖ్యుడిని బానిసలుగా చేసే మెత్తదనం. పురుషుడి హృదయాన్ని కరిగించివేసే ఆమ్లంలాంటి కన్నీరు అతని తలమీద ఒలికింది. అతనికి ఏడుపు రాబోతే దాన్ని తన్ని తగలేశాడు. తన తలతో ఆమె ఏమి చేసుకున్నా చేసుకోనీలే నిన్నటి వరకూ యాజమాన్య హక్కున్న ఆమె; చివరకు దాన్ని నరికినా – అని ఊరుకున్నాడు. యుగాలుగా, జన్మజన్మలుగా అతనికి

పరిచితమైన కొవ్వుతో, రక్తంతో  కూడిన వెచ్చటి, మెత్తటి మాంసపు ముద్దలుచర్మం తొడుగులో. వాటి మీది యాజమాన్యం తనదే అని నిన్నటివరకూ భావించినవి. మరొకడితో పంచుకోడం సాధ్యం కానివి అని అతను అనుకున్నవి. ఆమె పొత్తి కడుపులోకి అతని చుబుకం చొచ్చుకుపోయింది. అతని మనసును మోహం కమ్మేసింది. ఆమె అతన్ని హత్యచేయ దలచినా ఆ మోహం కరగనిది.

"నీ ఉద్దేశంలో ఇది పరిష్కారం లేని సమస్య.  మీ ఇద్దరి సంబంధం కొనసాగుతుండగా దాన్ని పరోక్షంగా, ప్రత్యక్షంగా అంగీకరిస్తూ నాతో నీకు గల సంబంధాన్ని నేను కొనసాగించుకోవాలి; లేకపోతె తెంచుకుని అవతలికి పోవాలి."

"నేను ఏ సమాధానం ఇవ్వగలను, కృపా?"

"నీవు అతన్ని ఒదలలేని స్థితిలో వున్నట్టే, అతనూ నిన్ను వొదలలేని స్థితిలో ఉన్నాడా? దీనికీ నీకు సమాధానం తెలియదా?"

"అది తెలుసుకోడం అసాధ్యమని తెలిసి తెలుసుకునే ప్రయత్నం చెయ్యలేదు."

"అతనికి నీ మీద నీకు అతని మీదున్నంత మోజు లేకపోతే?"

"అది వ్యాపారం కాదుకదా అతను నేనంటే ఇష్టపడకపోతే నేను ఇష్టపడక్కరలేదు అనుకోడానికి?"

"రాయుడితో నీవు ఏర్పరచుకున్న సంబంధం మాట? అది ఎలా తెంచుకోగలిగావు?"

"ఆ విషయం మీకు ఎలా తెలుసు?"

"అందరూ చూస్తుండగా బీచ్ రోడ్డులో ఒకరిని ఒకరు తాకుతూ నెలలకొలది తిరుగుతుంటే అందరికన్నా ఆఖరిగానైనా నాకు తెలియకుండా ఉంటుందా?"

"అతనితోటి బలవంతపు బ్రాహ్మణార్థం. అదోరకం మాయ; స్టాకోమ్  సిండ్రోమ్. నన్ను హింసించడం ద్వారా నా మనసును లొంగదీసుకున్నాడు. మగవాడికి మగ పందికి తేడా ఉండదు కనీసం కొందరు పురుషుల విషయంలో. అతను నాతో సంబంధాన్ని తెగతెంచుకున్నాడు; నేను ఆ పని చేయలేదు."

"అనంతం మగ పంది కాదు. నీ మనసును నవనీతంలా చోరీ చేసిన మహాపురుషుడు, అభినవ మన్మథుడు. స్త్రీ–పురుష వివాహేతర సంబంధాలకు కోటి కారణాలుంటాయి! అలాంటి అన్ని సంబంధాలకూ ఒకే నేపథ్యం ఉంటుంది. ఐనవాళ్లను మోసంచేయ్యడం. రాయుడు నిన్ను ఎందుకు ఒదిలేశాడో నీకు తెలుసా?"

"తెలియదు. అతన్నీ ఒక మగ పశువుగా జమకట్టాను. కారణాలు నాకు అనవసరమనుకుని వాటిలోకి వెళ్ళలేదు."

"మగవాడు మగ పంది అయితే, కొందరు ఆడవాళ్ళూ ఆడ పందులు. మొగపంది ఆడపంది దగ్గిరికి వెళుతుంది; స్త్రీ దగ్గిరికి కాదు. వాడి కబంధ హస్తాలలో నుంచీ నిన్ను నేను అనంతానికి డబ్బిచ్చి వినియోగించుకుని రక్షించుకున్నాను. వాడిని పారద్రోలి వీడు నిన్ను తగులుకున్నాడు."

ఆ వివరాలన్నీ పూసగుచ్చినట్టు చెప్పాడు. కృపా పై ఆమెకు ఎలాంటి అసహ్యం కలగలేదు. దాన్ని తన భర్తకు తనతో గల సంబంధపు గాఢత్వంగా ఆమె అప్పటి కల్లోలిత మనసు తీసుకుంది.

"నేను ఆ విధంగా కూడా నిన్ను ఇబ్బందిపాలు చేశానన్నమాట."

"అనంతం మీద అసహ్యం కలగడం లేదా; నిన్ను పన్నాగంతో చేజిక్కుంచుకున్నందుకు?"

"డబ్బవసరమయి ఆ పనికి పూనుకుని ఉంటాడు. డబ్బవసరం చేయించలేని నేరం ఉందా? నీకు సహాయం చేద్దామన్న సదుద్దేశం కూడా అతనిలో ఉందేమో! అతనికి దొరికిపోవడానికి అతను వేటగాడూ కాదు, నేను వేటాడబడే మృగాన్నీ కాదు. రాయుడిని నా నుంచీ విడదీయడం ద్వారా పరోక్షంగా నాకు ఉపకారం చేశాడు."

"అతనిపై ఏహ్యాభావం కలగడం లేదన్నమాట!"

"అలా కలగాలని ఇంతకాలం రహస్యంగా దాచుకున్న విషయాన్ని నాకు ఇప్పుడు  చెబుతున్నారు."

"మన సమస్యకు ఏ పరిష్కారం లేదా?" దీనంగా అడిగాడు కన్నీరు కళ్ళలో సుడి తిరగకుండా నిగ్రహిస్తూ.

"దీన్ని సమస్యగా భావించకుండా ఉండటం పరిష్కారం, కృపా. నిన్ను చుంబించాలనుంది ఎక్కడబడితే అక్కడ. రగిలే గుండెకు ముద్దు నవనీతంలా పనిచేస్తుందోలేదో నాకు తెలియదు. నాకు చాలా విషయాలు తెలియవు అనుకోడంలో ఏదో ఊరట ఉంటుంది కదా, డియర్?"

ఆమె  మైకం వదలి చూసేసరికి అతను లేడు. ఇంట్లోకెళ్ళాడేమోనని పాయిఖానాలు, పడకగదులు, వంటగది వెదికినా అతను కనబడలేదు; ప్రస్తుతానికి అతనికి అదృశ్యశక్తి లేదు.

జాగ్రత్తగా ఉండమని కాపలాదారుడికి  చెప్పి తన కారు పోనిచ్చాడు అనంతం. తూర్పుకు దిక్కుగా వెళ్లి దక్షిణం దిక్కుకు తిరగాలి. కారును విమానంలా తోలగల నైపుణ్యం అతనిలో ఉంది.

ఇప్పుడు అతనికి ఖరీదైన ఇల్లుంది ఈస్ట్ పాయింట్ కోలోనీలో.  దాని మీద ఎన్ని అంతస్థులను నిర్మించుకోడానికైనా వీలుంది. అతను సంకల్పించాలేగాని  డబ్బులేమిదనం అడ్డురాదు. సంపాదిస్తున్న డబ్బును ఎవరిపేరపెట్టి, లేక ఎక్కడ దాచుకోని కాపాడుకోవాలన్నది ప్రస్తుత సమస్య. సుమతిని ఎప్పుడు ఒదిలించుకోవాలన్నది కూడా సమస్య.

సముద్రం రోడ్డు చేరి దక్షిణానికి కారు వేగం తగ్గించకుండానే మళ్ళీ రెండు మూడొందల గజాల దూరం వెళ్ళాడు. ఎవరో వ్యక్తి రెండు చేతులూ ఎత్తి రోడ్డుమధ్యలో  నిలబడున్నాడు; చస్తేనేంగాక అన్నట్టు. కారు దగ్గిరవుతున్నా ఆ వ్యక్తి తప్పుకోవడంలేదు. ఇక్కడ ఆత్మహత్యలు జరుగుతుండటం అనంతానికి తెలుసు. వీడూ ఆబాపతు అనుకున్నాడు ముందు. కానీ చెంతనే సముద్రముండగా కారుకిందపడటం, దాని యజమానికి ఇబ్బంది కలిగించడం ఎందుకో? దగ్గిరికి రాగానే రోడ్డుపక్కన మరో కారు పార్కు చేసుంది. ఆ వ్యక్తిదే కావచ్చు. అది చెడిపోయి సహాయానికి తన కారు ఆపుతున్నట్టున్నాడు.

కారుంది కాబట్టి దొంగోడు కాకపోవచ్చు. కారు అద్దాలు మూసేసి ఉండటం వలన వాడు గగ్గోలుపెడుతున్నట్టు తెలుస్తోంది కానీ, అది  వినబడటంలేదు. కారు మూసుండకపోయినా, సముద్రం హోరులో గగ్గోలు వినబడదు. తన దారిన తాను పోవుటయా, ఒకసారి కారు ఆపి ఆ వ్యక్తి చెప్పదలచుకున్నది వినుటయా? కారు దగ్గిరవుతుండగానే, హెడ్లైట్లు ఆ వ్యక్తిమీద పడి  అతనెవరో  అనంతానికి తెలిసిపోయింది. కారు ఆపాడు.

"కృపా గారూ, ఇంతరాత్రివేళ ఇక్కడేమి చేస్తున్నారు? తొమ్మిది పది దాటితే సముద్రపు గాలి ఒంటికి మంచి చేయకపోవచ్చు. కనీసం ఇబ్బందికరం."

"నీతో ముఖ్యమైన విషయం మాట్లాడాలి."

"నా కార్యాలయానికొస్తే సరిపోయేది కదా? అదెక్కడో మీకు తెలుసు."

"ఇక్కడే, ఒంటరిగా మాట్లాడ దలచాను,"

అలా కృపా ఎప్పుడు నాతో మాట్లాడలేదు అనుకున్నాడు అనంతం. ఇది చిన్న విషయం. అనుకోనిపెద్ద విషయాలే కోటానుకోట్లు జరుగుతుంటాయి. అలాంటి వాటిని తట్టుకుని ఉండటానికి వీలుగానే గుండెలు, మనసులూ తయారుచేయబడతాయి. తయారీలోపాలు అక్కడా ఇక్కడా ఉంటుంటాయి.

"పోనీ మీ కారులోనో, నా కారులోనో కూర్చుని మాట్లాడుకుందాము."

"నాకు సముద్రపు ఇసుకలో కూర్చుని మాట్లాడాలనుంది."

"ఇది వేళకాని వేళే కానీ; మీ స్వల్పమైన కోర్కెను ఎందుకు కాదనాలి?" అంటూ కారులోనుంచీ బయటపడ్డాడు అనంతం.

"మంచు కూడా పడుతుందేమో, సముద్రపు తేమకు తోడుగా." అన్నాడు అనంతం.

"ఫర్లేదు; చావం."

"భలేవారే! ఈ వేళ చావుల జోలికి ఎందుకూ వెళ్లడం? పిలిస్తే అవి వచ్చే దినాలివి."

""పాపిహి చిరాయువుహు."

"పాపి కానివాడెవడండీ? అయినా అర్థాంతరంగా ఎందుకు పోవడం?"

"నీవు మాట్లాడే ధోరణి వెగటుగా ఉంది."

"తీపి పదాలు, వగరు పదాలు అన్నవాటి పట్టికను  చదువుకునే రోజుల్లో ఎప్పుడూ చూడలేదు నేను."

"ముందు అల్లక్కడికి పద," చీకటిలోకి చేతిని చాపి కనీకనబడని చోటును చూపించే ప్రయత్నం చేశాడు కృపారావు.

"సముద్రం ఇవతలికెగా?"

"బతికుండాలని అంత కోర్కె ఎందుకు?"

"కొందరికి వెయ్యేళ్ళు బతికుండాలనుంటుంది; దేవుడు లాంటి గాడిదకు ఇరవైఏళ్లకే తనువు చాలించాలనుంటుంది."

"మనుషులనే కాక, దేవుడిని ద్వేషించి ఏమి పావుకుందామని?" నడవటం మొదలుపెట్టి అన్నాడు కృపా.

"నేనన్నదేవుడు; మీరనుకుంటున్నవాడు కాదు."

"మతం మారావా?"

"నాకు  మతం అంటూ అసలుంటేగా కదా? దేముడు అన్న పేరు గల, ఆత్మహత్య చేసుకున్న కొన్ని గంటల పరిచితుడు వాడు కొండ మీది నుంచీ దొర్లి ఈ లోకం ఒదిలినవాడు."

అనంతానికి ఉన్నట్టుండి వెన్నులో భయం కలిగింది దేముడి గురించీ చెప్పినపుడు; అతనికి దేవుడి మీదే కాక దయ్యం మీద కూడా పెద్దగా నమ్మకం లేకపోయినా. కృపారావు చేతిలో ఏదో ఒక ఏడెనిమిదంగుళాల వస్తువుంది పేపర్లో చుట్టి.

"బీచిలో తినడానికి దేవుడిలా ఏదో తెచ్చినట్టున్నారు," అన్నాడు భయాన్ని మభ్యపెట్టడానికి.

"అదేదో కూర్చుని మాట్లాడుకుంటున్నపుడు తెలుస్తుంది దానికి పనిపడుతుందో లేదో అన్న విషయం."

"అపరాధపరిశోధక నవలలు చిన్నపుడు అధికంగా చదివారా?"

"బూతు పుస్తకాలు కూడా కనీసం కంటితో చూడలా. నా భార్యతో కలవడానికి వాటి సాయం అక్కరలేదు."

వీడు తన భార్యతో నాకుగల సంబంధం విషయంలో తాడోపేడో తేల్చుకోడానికి వచ్చాడు. దాన్ని వాడు అర్థంచేసుకోడానికి ఒక యుగ కాలం పట్టినట్టుంది. కార్యాచరణకు పూనుకున్నాడా? తెగించిన పిల్లి కూడా దానికి చేతనయిన దెబ్బ కొట్టకపోదు. తాటాకుచప్పుళ్ళను మాత్రం చేయగలడు నేను అర్థం చేసుకున్నంతవరకూ. కీడు ఎంచాలి ముందు ఎందుకైనా మంచిది. కాస్త  ఎడమ ఎడమగా ఉండే ప్రయత్నం చెయ్యాలి. కాళీయం లాంటి రాయుడిని ఎదిరించిన తనకు కొత్తగా భయం రోగం పెట్టుకున్నట్లుంది. అప్పటి జీవితం తెగింపు ఇచ్చింది; ఇప్పటి జీవితం ప్రాణానికి సంబంధించినంత వరకూ తెగింపుకు ఎసరుపెట్టింది.ఇప్పటిది సుఖవంతమయినది, విలువైనది.

వీడికి సుమతి అంటే ప్రాణం. తనను చంపగలిగినా చంపలేకపోయినా, వాడిని వాడు  చంపేసుకోగలడు. ప్రేమకు, పిచ్చికి తేడాలేదని సుమతి రుజువు చేసింది. ఆడకుక్క కూడా, మగకుక్కపట్ల అంత ప్రేమనూ విశ్వాసాన్ని కలిగి ఉండదు. అలా అని అన్ని ఆడకుక్కలూ, అతిగా ప్రేమించి మగకుక్కలకు ప్రాణాలు అర్పిస్తాయి అని చెప్పడం అసాధ్యం. నిజానికి సుమతికి కృపా ఒక బానిస. ఆమెకు నేను బానిసను అని చెప్పుకోడానికి గర్వపడతాడేమో కూడా. ఈ బానిస ఇప్పుడు ఆమెపై తిరగబడలేక నాపై తిరగబడాలనుకుంటున్నాడు.

"అన్నట్టు అది నా కారే అని ఎలా గుర్తుపట్టగలిగారు, కృపా గారు?"

"మీ కారు నేను ఎప్పుడూ చూసుండలేదా, అనంతం గారూ?"

"మీది అంత మంచి ప్రశ్న కాదేమో! నా కారులాంటివి ఈ ఊళ్ళో కనీసం పదుండవూ? రాత్రివేళ కదా; పైగా ఎన్నో వాహనాలు ఈ దారిని వెళుతూ ఉంటాయి కదా?"

"ఇంత చిన్న విషయం గురించీ ఈ వేళ మనం మాట్లాడుకోడం అవసరమా?"

"అవసరమో, కాదో. ఎలాగూ మనం వెళ్ళవలసిన చోటుకు ఇసుకలో కూరుకుపోతూ ఒంటెల్లా నడవాలి కదా. ఈ లోపల చిన్నపొన్న విషయాలు మాట్లాడుకుంటే కాలక్షేపం అవుతుంది, విసుగుదల ఉండదు. బేతాళుడు విక్రముడికి విసుగ్గా ఉండకూడదని కాకమ్మకథలు చెప్పి వేధించాడు."

"మీ కంపెనీ గేట్ దగ్గిర చీకట్లో కారు ఆపుకుని పొంచి ఉండగా పోర్టీకోలో నిలబడి మీరు చాలాసేపు కాపలాదారుతో మాట్లాడడం గమనించి, మీరు కారు బయటికి తీయడానికి లోపలికి దూరంగానే, నేను శరవేగంతో వెళ్లి అక్కడ కాచాను."

"అలా నిఘా వేయడానికి మీకు సిగ్గనిపించలేదు గదా?"

"'అంతకన్నా వెధవపని చేసేవాడికి, సంసారాలను గడ్డపార కూడా లేకుండా కూల్చే మనిషికి లేని సిగ్గూ శరం నాకెందుకు?"

"ఇంతటి చల్లటి వేళ, జలరాశి పక్కన మీలో ఇంతటి వేడుందేమిటి?"

"అది అణు వేడి; గుండె అనే రియాక్టరు లోనుంచీ పుడుతోంది. బడబాగ్ని సముద్రంలోనే ఉంటుంది."

పగలబడి నవ్వాడు అనంతం.

"రాక్షసుడు నవ్వినట్టుంది. నీ మెదడులో తప్పు అన్న పదానికి, దయ అన్నపదానికి అణు మాత్రమైనా చోటుందా?"

"కృపా గారు ఎప్పుడూ లేనిది ఏకవచన సంబోధనకు దిగారు. చాలా బాధలో ఉండుంటారు. దాన్ని కనీసం ఏదో ఒక మాటలతోనన్నా తీర్చుకునే ప్రయత్నం చేసుకోవాలి. నేను అర్థంచేసుకోగలను. నేను మిమ్మల్ని బహువచన సంబోధనే చేస్తా; మీరు నన్ను ఒరే అనేసుకుంటుండండి. నాకన్నా కనీసం పదేళ్లు పెద్ద మీరు వయసులో. ఒరే అంటే నిజానికి నాకు వినడానికి బావుంటుంది. నాకు అన్నలాంటి వారు."

"నీ చేత అన్న అని పిలిపించుకోడంకన్నా సముద్రంలో దూకి తనువు చాలించడం మేలు."

"మీకు ఏది మంచిదనిపిస్తుందో అది చేసేసుకోండి; నాకు కావలసినది నేను చేసేసుకుంటుంటా."

"ఇక్కడ కూర్చుందాము రా. కెరటాలకు అందం. అవి పాము నాలుకలలా, మొసలి నాలుకలలా ముందుకు చాచుతున్నా.

అతను కూర్చుండిపోయాడు. అనంతం అయిదారు అడుగుల దూరంలో కూర్చున్నాడు.

"నువ్వు అంత దూరంలో కూర్చుంటే సముద్రంహోరుకు ఒకరిమాటలు ఒకరికి వినబడవు."

"ప్రేయసీప్రియుల్లా దగ్గిరగా కూర్చోడం నాకు అంత ఇష్టముండదు; పైగా ఇద్దరం మగాళ్ళం. వేదాంతరావు మీకు బదులు అక్కడ కూర్చునుంటే ఇరవై అడుగుల దూరంలో కూర్చునుండే వాడిని. వాడు పీల్చి వదిలే గాలి కూడా మృగ మదం వాసన కొడుతుంది; అలా కొట్టకుండా ఉండటానికి సాయబు దగ్గిర కొన్న అత్తరు నుంచీ దిగుమతి చేసుకున్న సుగంధము దాకా వాడతాడు." అంటూ దూరాన్ని రెండడుగులు తగ్గించాడు అనంతం.

వీడు దగ్గిరకు రమ్మన్నది నిజంగానే మాటలు వినబడవనా?

"ఆ తినే వస్తువేదో ఇద్దరం తినేస్తే పోతుందేమో?"

"అది తినే వస్తువని నీకు ఎవరు చెప్పారు? నేను చెప్పలేదే? నాకుతప్ప ఎవరికీ తెలిసే అవకాశం అస్సలు లేదు."

"దేముడు పాపం చావబోయే ముందు కూడా పుచ్చుపళ్ళతో జంతికలు తిన్నాడు; నాకిస్తానంటే తిరస్కరించా."

"మనిషి ప్రాణం తియ్యడానికి బ్లేడు చాలు, ఒట్టి వేళ్ళు చాలు, ఒక తలగడా చాలు, చుక్క విషం చాలు – ఎంతటి బలహీనమైనది ప్రాణం! అని ఆశ్చర్యపడ్డాడు అనంతం. దేవుడు చావకుండా ఉండుంటే వాడితో ఈ విషయం చర్చకు పెట్టుండేవాడు. అన్నయ్య, అన్నయ్యా అని వెధవ నోరారా పిలిచేవాడు; వాడి ముందు ఉండటం శరీరం బల్లి పాకినట్టుండేది. ఏ దుర్మార్గపు తల్లిదండ్రులు కన్న బిడ్డో! మిగతా జీవరాశిలో కని, సంతానాన్నీ వదిలేసే వాటివి లేవేమో! పాము తన గుడ్లను తాను తింటుందంటారు. కనీసం అది నయం. దేవుడిపట్లే, పై దేవుడు (ఉంటె) దుర్మార్గంగా ప్రవర్తించాడు. ఆ దేవుడికి ఈ దేవుడంటే ఎందుకంత పగో. తన సృష్టిని చర్చకుపెట్టాడనేమో."

"ఏ దేవుడి గురించీ కాదు నేను మాట్లాడదలచినది."

"నాకు ఇక్కడికి బాగా వినిపిస్తుంది మీరు రహస్యాలు మాట్టాడినా. ఇంకా దగ్గిరికి వచ్చి మీ ఒళ్ళో కూర్చోమన్నా కూర్చుంటా."

"నీవు నాకు ఇంతటి ద్రోహం ఎలా చేయగలిగావు?"

"ఎందుకు చేశావు? అని అడిగితే బావుంటుందేమో ఒకసారి ఆలోచించండి."

"ఎందుకు అన్న ప్రశ్నకు నీవు సమాధానం చెప్పు."

"నేను జీవించడానికి, పైకి రాటానికి నా ముందు తెరుచుకున్న దారి అది ఒకటే అని నేను నమ్మడంవలన."

"అతి తెలివి ప్రాణాంతకం."

"తెలివి అతా, తక్కువా అని చెప్పడమూ కష్టమే. మీ తెలివితక్కువ వలెనే ఇదంతా జరిగింది అని నేనంటే?"

"నీవు నా భార్యతో సాగిస్తున్నది నాకు చేస్తున్న ద్రోహం కాదా?"

"నిజంగా అది ద్రోహం కిందికే వస్తే అది ఏ విధంగా ద్రోహం అవుతుందో వివరించండి. అది ఆమె మీకు చేసిన ద్రోహం అవుతుంది."

"మాది అగ్ని సాక్షిగా ఏర్పరచుకున్న భార్యాభర్తల సంబంధం. ఆ సంబంధంలో లైంగిక సంబంధం అంతర్భాగం. మా ఇద్దరి మధ్య మాత్రమే ఉండవలసినది. ఆమె డబ్బు తిని, ఆమెను ఆకర్షించి, ఆమెతో లైంగిక సంబంధం కలిగి ఉండటం వైవాహిక వ్యవస్థకే అపచారంచేసినట్టు కాదా? రేపు నీకు పెళ్లయి నేను నీ భార్యను మరిగితే తేలికగా తీసుకుని వాదించగలవా?"

"వివాహవ్యవస్థకు, ప్రేమవ్యవస్థకు (ఉంటే), సంసారవ్యవస్థకు (ఒక వేళ ఇది వివాహ వ్యవస్థలో అంతర్భాగం కాకపోతే), లైంగికవ్యవస్థకు (ఉంటే), స్త్రీ అవస్థకు భాష్యకారుడిగా భావించబడే శ్రీ గుడిపాటి వెంకట చలం పుస్తకం మీరు ఒక్కటికూడా చదవలేదని నాకు ఇప్పుడు అర్ధమయింది. కనీసం 'మైదానం' చదవండి; నేనే కొనుక్కుని తెచ్చి కానుకగా ఇస్తా. దాన్ని శ్రీ రాచకొండ విశ్వనాధ శాస్త్రి 'మైథునం' అన్నట్టు విన్నా. ఆయనలో లైంగిక నిగ్రహ శక్తి కాస్త కొరవడి తట్టుకోలేక ఆయన అలా అన్నారో ఆయనలోని సంస్కారం, బాధా అలా అనిపించాయో ఆయనే చెప్పాలి. చెప్పడానికి ఆయన పరమపదించారు. మీరు మై 'తూ' నం అంటారెమో చాలా సాంప్రదాయ వాదివిలా. న్యూరోటిక్ రచయితల రచనలకు అర్థాలే వేరు. కాస్తోకూస్తో న్యూరోసిస్ లేనిదే మంచి రచయితలు కాలేరు. ఆ రోగం మితిమీరితేనే పేచీ. భర్త అనుమతితోనో లేక భర్తకు తెలియకుండానో వివాహేతర లైంగిక సంబంధాలను కలిగి ఉండటం, భర్తను ఒదిలేసిపోవడం అనే స్వేచ్ఛాయుత నడవడికి కారణాలు చూపిస్తూ ప్రగతి శీలంగా భావించడం జరుగుతున్నదే. భార్యాభర్తల సంబంధాలలో ఊహ తెలియని సంతానం మీద అవి చూపించే ప్రభావం ఊసు తక్కువ. ఆ చర్చ ముళ్లకంపను విడదీసే ప్రయత్నం చెయ్యడమే. నేను రచయితను కూడా కాదు; ఇది సందర్భమూ కాదు. అందుచేత ఆ పని చేయదలచుకోలేదు. ఆ కుర్రాడి భార్యనో చెల్లినో తల్లినో మరొకరు లేపుకు పోతే చలం గారిలా – విశాల హృదయంతో ఆలోచించి, చిరునవ్వు నవ్వి, ఆనందించి, హాయిగా నిద్రపోతాడేమో నాకు తెలియదు గనుక ఆ విషయంలో మీరు ప్రశ్నించినా నేను సమాధానం చెప్పలేను. ప్రేమ కేవలం గుడ్డిది. కామం గుడ్డిన్నరే కాక, చెమిటిది, మూగది మరియూ బుద్ధిలేనిది కూడా. నా భార్యకు సంబంధించినంత వరకూ ఊహాజనితమైన ప్రశ్నలకు సమాధానాలు నాకు ఇవ్వాలనుండదు. నాకు మీ భార్యతో లైంగిక సంబంధం కలదు అని మీ దగ్గిర రుజువులున్నాయా? ఆమె తన దగ్గిర సోమరిగా ఉన్న డబ్బును ఒక పుణ్యకార్యానికి, ఒక జీవితాన్ని నిలబెట్టటానికి వినియోగించిందనుకో అప్పుడు కృతజ్ఞతాభావం అన్న మాటకు అర్థం ఉండదు."

"నీవు మాటలు నేర్చిన కుక్కవు."

"రాయుడిలా తిడుతున్నారు, బ్రో. చిలకలు మాటలు నేర్వగలవు అని విన్నా కానీ; కుక్కలు నేర్వగలవు అని వినలేదు. మనుషులు నేర్వకపోయినా మొరగ గలరన్న విషయం నాకు తెలుసు; నేను మొరగక పోయినా."

"బుకాయింపులవల్ల నీ తప్పిదాన్నుంచీ తప్పుకోలేవు. నా భార్య ద్వారా సాక్ష్యం చెప్పించడమే చివరకు మిగిలేట్టుంది. అప్పుడు మీ భార్యా, మీరూ ఒకటై నన్ను బోనులో నిలబెట్టాలని చూస్తున్నారు అని అనగల సమర్థుడివి."

"మీ భార్యకు చెప్పుకో వచ్చుగా; నాతో సంబంధాన్ని తెగతెంపులు చేసుకోమని?"

"నీ సలహా అక్కరలేదు."

"నన్ను చంపడం తప్ప మీ ఇష్టమైనది చేసుకో వచ్చు."

"అదీ నీవు చెప్పనక్కరలేదు. నిన్ను చంపడం తప్ప నాకు ఇష్టమైనది వేరే ఇంకేమీ లేదు."

"కారాగారంలో మీ భార్య మీతో కాపురం పెడుతుందా? ఆ చంపడమేదో మీ భార్యనే చంపుకో వచ్చుగా. ఒకవేళ తప్పే జరిగుంటే ఆమె కూడా భాగస్వామేగా?"

"ముందు ఒకభాగస్వామిని చంపితే రెండో భాగస్వామిని ఏమి చెయ్యాలా అన్నది నేను తేల్చుకోగలను. నిన్ను ఈ ఇసుకలో ఎంద్రకాయను చంపినట్టు చంపకుండా ఉండాలంటే నా భార్యనుంచి దూరమవుతానని ముందు నాకు మాటివ్వు; ఈ కాగితం మీద వ్రాసి సంతకంపెట్టు; రేపటినుంచీ దీనికి కట్టుబడి ఉండు. ఇసుకలో, ఇక్కడ నిన్ను చంపలేకపోయినా సుపారీ ఇచ్చయినా నీ రక్తం కళ్లచూస్తా. రాయుడి మీదికి నిన్ను ప్రయోగించినట్టు నీకన్నా రాక్షసుడిని ఆశ్రయించి అంతకన్నా రెట్టింపు డబ్బు ఖర్చుపెట్టి నీ అంతం చూస్తా; నీవు అనంతం కాదు."

మొండి ధైర్యం వచ్చింది అనంతానికి.

"మీరు బ్లేడో, కత్తో పట్టుకుని నా మెడ కోస్తానంటే చూస్తూ ఊరుకోడానికి నేను కోడినా? చూడండి కృపా గారూ, మీరు సుమతి గారికి నచ్చచెప్పండి నన్ను కలవద్దని; సమస్య తీరిపోతుంది. రెండు చేతులు కలిస్తేనేగా శబ్దం అయ్యేది? లైంగిక కార్యానికి రెండు శరీరాలు అవసరం కదా?"

"కల్లబొల్లి మాటలు వొద్దు. 'సుమతీ నీవంటే నాకు మోజు పోయింది; నేను నిన్ను కలవను, నువ్వు చచ్చినా నన్ను కలవక,' అని నా ముందే, ఇక్కడే, నీ ఫోను నుంచీ చెప్పు."

"మీ అమాయకత చూస్తే నాకు ముచ్చటేస్తోంది. అలా చేసి దానికి కట్టుబడి ఉండకపోతే మీరు చేయగలిగిందేముంది?"

"ఫోను చెయ్యడమే కాక దానికి కట్టుబడివుండటం నీకు నిన్ను చంపడానికి బదులుగా ఇస్తున్న ఒక అవకాశం. వినియోగించుకుంటావో లేదో తేల్చుకో."

"మరోసారి చెబుతున్నా. ఆమె ఒప్పుకుంటే నన్ను పట్టుకుని ఇలా వేలాడవలసిన అవసరం ఉండేది కాదు. నేను ఫోను చేస్తే ఆమె అలాగే, అనంతం, అని ఒప్పేసుకుంటుందా? నన్ను ఆమె వదలనని నన్నుపట్టుకుని వ్రేలాడితే నేను ఆమెను ఒదిలించుకోగలగడం చిన్నవిషయామా?"

"ముందు సగం పని కానీ; రేండో సగం గురించీ నేను చెయ్యవలసినది చేస్తా."

"తప్పించుకోడానికి వీలు లేనప్పుడు హత్యలు చెయ్యకూడదూ, చేయించకూడదు. మీరు ఉద్రేక స్వభావి. ఒకవేళ మీరు తప్పించుకోగలిగినా, మీరే హత్య చేయించుంటారని గ్రహించలేని దద్దమ్మ గారు కాదు సుమతిగారు; ఆవులించకుండా మన పేగుల సంఖ్య ఎంతో చెప్పగలరు. తాను అంత అధికంగా ప్రేమించిన వ్యక్తిని భూమ్మీద లేకుండా

చేసిన వ్యక్తి నేరాన్ని సులువుగా తీసుకుని మీతో యథాతథంగా ఉండలేదు. మీ చేయి రక్తంతో తడిసినా (కడుక్కున్నా) ప్రయోజనం సిద్ధించదు  అని దయచేసి గమనించండి. నా మీది పగ మాత్రం చల్లారుతుంది. దేముడిని చేరి పారభౌతిక చర్చలు చేసుకుంటాను. విజ్ఞతతో ఆలోచించండి. జరిగేదాన్ని జరగనివ్వండి మీరు నమ్మే దేవుడి మీద భారం వేసి. ఒక్కోసారి కాగల కార్యం గంధర్వులు నెరవేరుస్తారు. భారతం ఎంతోకొంత మీరూ వినే ఉంటారు. వింటే భారతమే వినాలి; తింటే గారెలే తినాలి."

"ఆమె నిన్ను ప్రేమించినంత గాఢంగా నన్నూ ప్రేమిస్తోంది అన్న విషయం నీవు గ్రహించినట్టు లేదు. గాఢంగా ప్రేమించిన ఒక వ్యక్తిని కోల్పోయినప్పుడు, అంతే గాఢంగా ప్రేమించిన మరో వ్యక్తిని పోయిన వాడి గురించీ కోల్పోతుందని భావించక్కరలేదు. దానర్థం: నిన్ను చంపినా ఆమె నాతో సరిపెట్టుకోడానికి ప్రయత్నించవచ్చు నేను కారాగారంపాలవ్వకుండా చూసుకుంటే. ఆమె నాకు దక్కకపోయినా నీకు మాత్రం దక్కనివ్వను కారాగారంపాలయినా."

"సాధారణ స్త్రీ హృదయం ఇరుకు గది; సుమతి హృదయ పరిమాణం ఏపాటిదో నాకు కొంత అంచనా ఉంది. ఈమె అసాధారణ వ్యక్తి. ఇద్దరినీ సమానంగా ఆమె ప్రేమిస్తోంది; నువ్వూ నేను ఆ హృదయంలోని చోటు గురించీ ఒకరిని ఒకరం హత్య చేసుకోకుండా ఎవరిపాటికి వాళ్ళం జీవిద్దాం. ఇంతవరకూ అలాగే జీవించాము. కాకపోతే విషయం ఇప్పుడు నీకు తెలిసింది; పేచీకి దిగావు.  ప్రేమలత హృదయంలో రాయుడికి, రంగా గాడికీ చోట్లు దొరకలేదా? కొందరిస్త్రీల హృదయాలు సువిశాలమైనవి హాలంత. స్త్రీ హృదయం అగాధం అని ఎవరో అనగా విన్నాను. ఆమె నిన్ను నీవన్నట్టు గాఢంగా ప్రేమిస్తున్నా, నన్ను పంపించెయ్యకుండా నాతో కాపురం చేస్తోంది కదా?"

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS